ప్రజాశక్తి
శనివారం 29 జులై 2023 5 అనంతపురం

తహాశీల్దార్ కార్యాలయంపై జాతీయ పతాకం రెపరెపలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

తహాశీల్దార్ కార్యాలయంపై రెపరెపలాడుతున్న కొత్త జాతీయ పతాకం

తాడిపత్రి రూరల్ : తహాశీల్దార్ కార్యాలయంపై చిరిగిన జాతీయ పతాకాన్ని ఎట్టకేలకూ అధికారులు మార్చారు. తహాశీల్దార్ కార్యాలయంపై చిరిగిన జాతీయ పతాకంపై ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. కథనానికి స్పందించిన అధికారులు పాత జెండాను తీసివేసి కొత్త జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ పతాకాన్ని మార్చడంతో పట్టణవాసులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలి

మహిళా కళాకారుల నాట్యప్రదర్శన

హింసపై మహిళల పోరు యాత్ర ప్రారంభంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

హిందూపురంలో నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-హిందూపురం

మహిళల రక్షణే తమ లక్ష్యమంటూ గద్దెనెక్కిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ లక్ష్యాలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని చట్టాలను చేయడమే కాదు వాటిని కఠినంగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి విమర్శించారు. ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన హింసపై మహిళల పోరు యాత్ర శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి శుక్రవారం ప్రారంభం అయింది. ఈ యాత్రను కార్మికురాలు అక్కమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఐద్వా జిల్లా గౌరవ అధ్యక్షురాలు దిల్షాద్ అధ్యక్షత ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అలివేలు, కోశాధికారి సావిత్రి, రాష్ట్ర నాయకురాలు గౌతమి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దేశంలోనూ... రాష్ట్రంలోనూ చిన్నారులపై మహిళలపై హింస రోజు రోజుకి విపరీతంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి బంగారు పతకాలను సాధించి, ప్రపంచ పటంలో దేశ గౌరవాన్ని చాటి చెప్పిన మహిళా మల్లయోధులు తమకు జరిగిన అన్యాయంపై దేశ రాజధానిలో ఆందోళన చేయడమే అందుకు నిదర్శనమన్నారు. ప్రతినిత్యం దేశంలో ఎక్కడో ఒకచోట మహిళలు హింసకు గురి అవుతున్నారన్నారు. మల్లయోధులపై లైంగిక దాడికి పాల్పడిన బిజెపి ఎంపిని అరెస్టు చేసినట్లు చేసి బెయిల్‌పై విడుదల చేశారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరిగించి అత్యాచారం చేసి హత్యలు చేస్తున్నప్పటికి ప్రదాని మోదీకి చలనం లేదన్నారు. చివరకు సుప్రీం కోర్టు స్పందించే వరకు కేసులు నమోదు చేయలేదన్నారు. కేసులు అయితే నమోదు చేసి ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. హిందూపురం ఎంపీ అర్ధనగ్నంగా మహిళతో సంభాషణ చేస్తున్న విడియోలు సామాజిక మాధ్యమాల్లో వచ్చినా అతనిపై చర్యలు చేపట్టలేదన్నారు. మహిళా రక్షణ కోసం తీసుకొచ్చిన ఫోక్స్ చట్టాన్ని ఎత్తి వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. గత కాలంలో మహిళలపై ఆంక్షలు విధించి అణచివేతకు గురి చేసిన మనువాద సిద్ధాంతాన్ని తిరిగి సమాజంపై, మహిళలపై బలవంతంగా రుద్దడానికి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మత్తు, మద్యం వల్లే నిత్యం మహిళలు హింసకు, దాడులకు గురి అవుతున్నారని వీటిని సంపూర్ణంగా నిషేధించాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర సమయంలో జగన్ మోహన్ రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దశలవారీగా మద్యం నిషేధిస్తామని చెప్పి నిషేధ చట్టాన్ని తీసుకురాక పోగా మత్తు పదార్థాలను విచ్చలవిడిగా దొరికే విధంగా చేశారని విమర్శించారు. ప్రభుత్వం తన చేతగానితనం వల్ల విశాఖ నుంచి హిందూపురానికి గంజాయి దిగుమతి చేసుకొని ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ పారిశ్రామిక కేంద్రంగా ఉన్న హిందూపురాన్ని.... గంజాయి ఎగుమతి కేంద్రంగా మార్చారన్నారు. ఇప్పటి వరకు 3200 మంది అమ్మాయిలు మాయం అయినారు. వీరి ఆచూకీని రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలన్నారు. 190 మంది అత్యాకారాలకు గురయ్యారన్నారు. వీరికి ఇంత వరకు న్యాయం జరగ లేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ బిజెపి ప్రభుత్వం దేశాన్ని, దేశ సంపదను, ఖనిజాలను ఆదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. అందుకోసమే ఆర్టికల్ 370 రద్దుచేసి కాశ్మీర్ భూములపై ఆదానీ, అంబానీల పెత్తనం చలాయించే విధంగా చేశారన్నారు. మణిపూర్ లో ఆదివాసులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో విలువైన ఖనిజ సంపద ఉందని తెలుసుకొని ఆ సంపదను ఆదానికి దోచిపెట్టడానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ రిజర్వేషన్ పేరుతో కులాల మధ్య చిచ్చు రేపి హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. మహిళలు వివస్త్రలను చేసి అత్యాచారం చేసి హత్యలు చేస్తున్న వారికీ మతతత్వ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని చూస్తూ ఉంటే నాటి రావణాసురులను మించిన రావణాసురులు నేడు ఉన్నారనిపిస్తోందన్నారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మీడియా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి హింస, అశ్లీలత, అసమానతలు ప్రేరేపించే చలనచిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలన్నారు. కళాశాలలో, పని ప్రదేశాల్లో వేధింపులను నిరోధించేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుని, ప్రతి మండలానికి ఒక మద్యం షాపును మాత్రమే అనుమతించాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలో రెండు ప్రాంతాల నుంచి పోరు యాత్రను చేపట్టామన్నారు. ఆగస్టు 9న విజయవాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి మహిళల పోరు ఏమి అన్నది ప్రభుత్వాలకు చూపిస్తామన్నారు. ఇప్పటికే దేశంలో అన్ని ప్రాంతాల్లోనే ఎన్నికల వేడి మొదలైందని ఇంటి ఇద్దకు వస్తున్న నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. మహిళల రక్షణ కోసం, ఆడ పిల్లల రక్షణ కల్పించడానికి కఠిన చట్టాలను తీసుకోచ్చి, వాటిని అమలు చేయాలని నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు లావణ్య, రామాంజనమ్మ, జ్యోతి, అక్కమ్మ, సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెడ్పీ శ్రీనివాసులు, ఇఎస్ వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి, నాయకులు నరసింహప్ప, జగదీష్, సిపిఎం అనుబంధ సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

పెనుకొండ : మహిళలపై జరుగుతున్న హింసను నివారించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన హింసపై మహిళల పోరుయాత్ర శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మహిళా రక్షణ నాటక ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి గౌతమి అధ్యక్షతన జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అలివేలమ్మ, రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ ,జిల్లా గౌరవాధ్యక్షులు దిల్షాద్ తదితరులు మాట్లాడారు. మహిళలపై హింసను నివారించడానికి తీసుకునే చర్యలపై న్యాయ నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్త్రీ పురుష సమానత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. జస్టిస్ వర్మ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ,జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ ,వెంకటరాముడు, నారాయణ,తిప్పన్న, నరసింహ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వెంకటేష్, రంగప్ప, తిప్పన్న, కొండ వెంకటేష్, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : హిందూపురంలో ప్రారంభమైన హింసపై మహిళల పోరుయాత్ర శుక్రవారం రాత్రి కదిరి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు గౌతమీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సావిత్రి, శ్రామిక మహిళ సంఘం కన్వీనర్ దిల్షాద్, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జివిఎల్ నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్‌వలి, రామ్మోహన్, ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో మాట్లాడుతున్న దిల్షాద్

కదిరిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకురాళ్లు

తుంగభద్ర జలాశయం నుండి ఎగువ కాలువకు నీరు విడుదల అవుతున్న దృశ్యం

తుంగభద్ర నుంచి హెచ్‌ఎల్‌సికి నీరు విడుదల

ప్రజాశక్తి - బొమ్మనహాల్

తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువకు నీటిని శుక్రవారం విడుదల చేశారు. జలాశయం ఎస్‌ఇ శ్రీకాంత్‌రెడ్డి, ఇతర అధికారులు శుక్రవారం ఉదయం గేట్ల వద్ద పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. గత సంవత్సరం తుంగభద్ర జలాశయం నుండి ఎగువ కాలువకు నీటి కేటాయింపు 20 టీఎంసీలతో పాటు అదనంగా ఎల్ఎల్‌సి డైవర్స్ వాటర్ పది టిఎంసిలు మొత్తం 30 టీఎంసీలు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది 25 టిఎంసిలు రావచ్చన్నది అంచనా. జలాశయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నీటిమట్టం 56 టిఎంసిలుగా ఉంది. ఇన్‌ఫ్లో లక్ష పదివేల క్యూసెక్కులుగా నమోదయింది. ప్రస్తుతం విడుదల చేసిన నీరు ఆంధ్రాలోని బొమ్మనల్ మండలానికి 48 గంటల్లో చేరవచ్చునని అధికారులు అంచనావేశారు. ప్రస్తుతం జలాశయం నుండి 500 క్యూసెక్కులు నీటిని విడుదల చేయగా ప్రతి రెండు గంటలకు ఒక సారి 100 క్యూసెక్కుల వంతున పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ఆత్మకూరు



ఘటనా స్థలంలో మృతి చెందిన రాఘవేంద్ర

మండల కేంద్రం సమీపంలోని కళ్యాణదుర్గం-అనంతపురం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఏఎస్ఐ రవిప్రకాష్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా పగిడిరాయికి చెందిన రాఘవేంద్ర (27), గార్లదిన్నె మండలం ముకుందాపురానికి చెందిన అనిల్‌కుమార్ (24) కలిసి ద్విచక్ర వాహనంలో సొంత పని నిమిత్తం ఆత్మకూరుకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి అనంతపురం వెళ్తుండగా జాతీయ రహదారిపైకి రాగానే అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో రాఘవేంద్ర అక్కడికక్కడే మృతిచెందారు. అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమ్తితం అనిల్‌ను 108 ద్వారా అనంతపురం తరలించారు. అతను చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. సమచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

జిల్లాలో మాతాశిశు మరణాలను తగించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో జరిగిన మాతా,శిశు మరణాలపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకూ జిల్లాలో 2 మాతా, 2 శిశు మరణాలు సంభవించాయన్నారు. ఇందులో పుట్లూరు మండలం సంజీవపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య మనిలక్ష్మీ మరణంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆయా పీహెచ్సీల పరిధిలో హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న వారిని గుర్తించడం లేదన్నారు. హైరిస్క్ ఉన్న వారిని గుర్తించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు, మెడికల్ అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా.యుగంధర్, జిజిహెచ్ సూపరింటెండెంట్ శంషాద్ బేగం, డిఎన్ఓ సుజాత, ఎస్ఓ మారుతీ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో నాయకుల, కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా రూరల్ వాటర్‌సప్లయ్ పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ కార్యాలయాన్ని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు కార్యాలయంలో బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ తాగునీటి సరఫరా పథకం కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది కార్మికులు అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. వేతనాలు చెల్లించడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బకాయి వేతనాలు చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఎమ్.గౌతమి చొరవతో రూ.33 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, కానీ ఇంకా కార్మికులకు బకాయి వేతనాలు మాత్రం చెల్లించలేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి కేటాయించిన నిధులను విడుదల చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా కార్మికులు పంప్ ఆపరేటర్స్, ఎలక్ట్రిషన్లు, వాచ్‌మెన్ తదితర కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారని వారందరిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలన్నారు. అక్కడికి వచ్చిన డిఇ శ్రీనివాసులుకు నాయకులు వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిఇ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్ట్ 1వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని నాయకులు, కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, తిప్పేస్వామి, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, రామాంజనేయులు, గంగాధర్, వన్నూరప్ప, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించాలి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని విధాల ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ యం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో 43వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తోందని, పారిశ్రామికవేత్తలకు విరివిగా రుణాలు అందించేలా చూడాలని అన్నారు. నూతనంగా పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే అర్హులను గుర్తించి వారికి అవసరమైన సహకారం అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మరిన్ని రుణాలు అందించేలా చూడాలని, నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడం కోసం చర్యలు తీసుకోవాలని చెప్పారు. రుణాల మంజూరు విషయంలో బ్యాంకుల నుంచి ఏదైనా సమస్య ఎదురైతే సంబంధిత ఎల్‌డిఎంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో 2015-20 ఇండస్ట్రియల్ పాలసీలో 2 యూనిట్లుకు రూ.6.50 లక్షలు, 2020-23 ఇండస్ట్రియల్ పాలసీలో 2 యూనిట్లకుగాను రూ.11.83 లక్షలు, జగనన్న బడుగు వికాసం క్రింద 8 యూనిట్లకు 1.07 కోట్ల రూపాయలు సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. వివిధ కారణాలవల్ల 1 యూనిట్లకు సంబంధించి 1 క్లెయిమ్‌ను తిరస్కరించారు. సింగల్ విండో పోర్టల్ నందు జూన్, జూలై నెలలలో 198 దరఖాస్తులు రాగా, అందులో 181 దరఖాస్తులు నిర్దేశించిన గడువులోగా ఆమోదించి 4 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 13 దరఖాస్తులను పెండింగు లేకుండా చూడాలని ఎపిపిసిబి, ఫ్యాక్టరీ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పిఎంఇజిపి 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో 341 దరఖాస్తులను వివిధ బ్యాంకులకు పంపించగా, నిర్దేశించిన 244 యూనిట్లు గాను 94 యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయని,105 యూనిట్లు మంజూరు దశలలో ఉండగా, నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా చేరుకోవాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజారావు, ఎపిఐఐసి జడ్ఎం వరప్రసాద్, ఎపిఎస్ఎస్‌పి బిఎమ్ మహేష్, అగ్రికల్చర్ జెడి ఉమామహేశ్వరమ్మ, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, ఎల్‌డిఎం సత్యరాజ్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ కేశవులు, ఫుడ్ ప్రాసెసింగ్ ఇన్‌ఛార్జి పీటర్ సైమన్, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్ రెడ్డి, ప్యాప్సి ప్రెసిడెంట్ శేషాంజనేయులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు ఒకటి నుంచి చంద్రబాబు సీమయాత్ర

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై ఆగస్టు ఒకటి నుంచి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు యాత్ర చేపడుతున్నట్లు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాలవ శ్రీనివాసులుతోపాటు, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారధి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను పెద్దఎత్తున చేపడతామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. ఆచరణలో ప్రాజెక్టుల నిర్మాణం ఒక్క అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. దీంతో ఈ ప్రాజెక్టుల స్థితిగతులను పరిశీలించేందుకు టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆగస్టు ఒకటవ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఆగస్టు ఒకటవ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లా బనకచెర్ల నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుందని వివరించారు. మొదటి రోజు కర్నూలు జిల్లా పర్యటన ముగించుకుని రెండో రోజు అంటే ఆగస్టు రెండో తేదీన కడప జిల్లాలోని గండికోట రిజర్వాయరుతో పాటు, అక్కడి ప్రాజెక్టులను ఆయన పరిశీలిస్తారన్నారు. రెండో తేదీ రాత్రికి అనంతపురం చేరుకుంటారని చెప్పారు. రెండో తేదీన అనంతపురం జిల్లాలోని ఉరవకొండ వద్ద సామూహిక బిందు, తుంపెర సేద్యం ప్రాజెక్టును పరిశీలించి, అక్కడి నుంచి బిటిపికి ఎత్తిపోతల పథకం, పేరూరు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తారని తెలిపారు. మూడవ తేదీన చిత్తూరు జిల్లాకు వెళతారని కాలవ శ్రీనివాసులు వివరించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొస్తున్నట్లు వైసిపి పెద్దఎత్తున ప్రచారం చేసిందని గుర్తు చేశారు. ఇది తరువాత అటకెక్కించారన్నారు. తమ హయాంలో రూ.980 కోట్లతో చేపట్టిన బిటిపి ఎత్తిపోతల పథకం, పేరూరు ఎత్తిపోతల పథకం ఏవీ ముందుకు పడలేదన్నారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాయలసీమకు తీరని నష్టాన్ని మిగిల్చారని విమర్శించారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు, పాల్గొన్న నాయకులు

ఘనంగా కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన పెద్ద సరిహద్దు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుళ్లాయిస్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. శనివారం తెల్లవారుజామున కుళ్లాయిస్వామిని పురవీధుల గుండా ఊరేగించనున్నారు. ఉదయం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. శనివారం సాయంత్రం కుళ్లాయిస్వామి జలధికి తరలివెళ్తారు. సోమవారం రాత్రి కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో ఉత్సవాలు ముగుస్తామని కార్యనిర్వహణ అధికారిణి శోభ తెలిపారు.

సోదనపల్లిలో చిన్న సరిగెత్తు

శింగనమల : మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో చిన్న సరిగెత్తు వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పీర్లస్వాములకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

పాపిరెడ్డికి జెసి పరామర్శ

పుట్లూరు : మండల కేంద్రానికి చెందిన పాపిరెడ్డికి గాయమై షుగర్ ఎక్కువ కావడంతో కాలును తీసివేశారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి పుట్లూరుకు చేరుకుని పాపిరెడ్డిని పరామర్శించారు. అనంతరం ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరివెంట టిడిపి జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె చెన్నారెడ్డి, తక్కలపల్లి గోపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, రాముడు, పుల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

గుంతకల్లు : కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ అన్నారు. నాగిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి చిన్నా, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు జిలాన్, దేవేంద్ర, షేక్షావలి, గోపీ, బాషా, నారాయణ, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించాలి

శింగనమల : పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.500 కూలి వచ్చేలా చూడాలన్నారు. అదేవిధంగా కూలీలకు మెడికల్ కిట్లు, టెంట్లు, పనిముట్లు అందించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఒక్కో మస్టర్‌కు ఒక్కో రేటు పెట్టి కూలీల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. టెక్నికల్ అసిస్టెంట్లు కూడా డబ్బులు అందించిన వారికి ఎక్కువ కూలి వేస్తూ.. ఇవ్వని వారికి తక్కువ వేస్తున్నారన్నారు. వెంటనే పనికి తగ్గ కూలి ఇవ్వడంతోపాటు పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

పశువులకు మందులు పంపిణీ

బెలుగుప్ప : పశుబడి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బెలుగుప్ప తండాలో పశువులు, గొర్రెలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో గొర్రె పిల్లలు పుడుతూ ఉంటాయన్నారు. ఈనేపథ్యంలో ఈదురు గాలుల కారణంగా పిల్లలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు, గొర్రెల కాపరులు పాల్గొన్నారు

బాధితుడికి ఆర్థిక సాయం

శెట్టూరు : గుండె సంబంధిత, పెరాసిస్‌తో బాధపడుతూ కాలు తొలగించుకున్న మండల కేంద్రానికి చెందిన బేకరీ రాజుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు బద్దేనాయక్ శుక్రవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. రాజు మధ్యనే షుగర్‌తో కాలు తొలగించుకుని తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నాడు. విషయం తెలుసుకున్న బద్యేనాయక్ ఆర్థికసాయం అచేశారు. దీంతో ఆయనకు రాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

IN THE COURT OF THE 1" ADDI JUNIOR CIVIL JUDGE:ANANTAPURAMU
I.A. No.123/2022 in O.S.No.663/2022
Between
Mrs. Thopudurthi Radha **...Plaintiff /petitioner**
And
1 Keelu potla Ramya @ Dasari Ramya
2. Keelu potla Kumar @ Dasari kumar
3 Keelu potla chaitanya @ Dasari chaitanya
4 Keelu pot la vindesh @ Dasari.vindesh
5 Keelu potla Raviteja @ Dasari Raviteja , 4&5 are minors , Rep. by NF Guardian/ Elder sister D1 Keelu potla Ramya @ Dasari Ramya
...Defendants/Respondents
Notice to Defendants/Respondents No 1 to 5
1.Keelu potla Ramya @ Dasari Ramya W/o k.krishnaiah@ Dasari
2.Keelu potla Kumar @ Dasari kumar S/o k.krishnaiah @ Dasari
3.Keelu potla chaitanya @Dasari chaitanya S/o k.krishnaiah @ Dasari
4.Keelu potla vindesh @ Dasari vindesh S/o k.krishnaiah @ Dasari
5.Keelu potla Raviteja @ Dasari Raviteja S/o k.krishnaiah @ Dasari 4&5 are minors, Rep. by NF Guardian/ Elder sister , D.1 Keelu potla Ramya @Dasari Ramya , All are residing at DoorNo. 4-1-177, Indiranager , Anantapuramu City & Dist.
ఇందుమూలముగా తెలియజేయడమ ఏమనగా ప్రతివాదులు 1 to 5 హాజరు నిమిత్తం పై కోర్టు నందు 14/09/2023వ తేదిన వాయిదా ఉన్నది. కావున పై తేది రోజున ఉదయం 10:30 గం॥లకు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.
(By Order of the Court)
L.PRABHAKAR REDDY
Advocate Ananthapuramu.

విరివిగా మొక్కలు నాటాలి : కలెక్టర్

ఆత్మకూరులో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-ఆత్మకూరు

జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద ఉన్న నగరవనంలో ఐఎఎస్ ఆఫీసర్స్ వైవ్స్ అసోసియేషన్ (ఐఎఎస్ఒడబ్ల్యూఎ) ఆధ్వర్యంలో చేపట్టిన మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ లో భాగంగా జిల్లాలో 57,450 వేల వరకూ మొక్కల పెంపకం చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని పంపనూరు వద్ద నగరవనంతోపాటు కలెక్టర్ క్యాంపు కార్యాలయం, ఎస్కే యూనివర్సిటీ, పెద్దవడుగూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, కూడేరు మండలంలోనిబసంపురం ఆంజనేయ స్వామి దేవాలయం, రాయదుర్గం వద్దనున్న నగరవనం, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో, బుక్కరాయసముద్రం మండలంలోని జంతలూరు వద్దనున్న సెంట్రల్ యూనివర్సిటీలో, సిద్ధరాంపురం వెటర్నరీ లైవ్ స్టాక్ రీసెర్చ్ స్టేషన్, రెడ్డిపల్లి ఓపెన్ జైల్ నుంచి జంతలూరు రోడ్డు పరిధిలో, వజ్రకరూరు మండలంలోని కొత్తకోట జడ్పీహెచ్ పాఠశాల ప్రాంగణంలో, కుందుర్పి మండలం కరిగానిపల్లి వద్ద, తదితర 30 ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, భార్య డా.రిషిఖ, డీఎఫ్ఓ సందీప్ కృపాకర్, సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఓ చంద్రశేఖర్ బాలాజీ, ఆర్డీవో మధుసూదన్, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులు, డిఆర్ఓ హుసేనప్ప, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దామోదర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఫ్లారెన్స్ దీప, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం ఎటిపి-7లో ప్రిన్సిపల్ పర్వీన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎజీఎం సుబ్బారెడ్డి, డీన్ చంద్రమోహన్, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మొక్కలను నాటడంతోపాటు పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందామని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచి సుశీల ఉమాశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ సచివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఓబులేసు, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, మాల్యం ఎర్రన్న, ఉమాశంకర్, సునీల్‌రెడ్డి, రామాంజనేయులు, చిన్న తిక్కన్న, మేకల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో హరిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సంస్థ ఎజిఎం సుబ్బారెడ్డి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

టిటిడి కార్మికులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తిరుమల తిరుపతి దేవస్థానంలో సేవలు అందిస్తున్న అటవీశాఖ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. శుక్రవారం టిటిడి కార్మికులు చేపట్టిన నిరసనలు వెయ్యి రోజులకు చేరుకున్న నేపథ్యంలో వారికి మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జి.ఓబులు మాట్లాడుతూ 200 మంది అటవీశాఖ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వెయ్యి రోజులుగా దీక్షలు చేపడుతున్నా పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవరించడం దుర్మార్గమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేలా టీటీడీ యాజమాన్యం చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధతం చేస్తామన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ టిటిడి బోర్డు నేతృత్వం, ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 25 ఏళ్లుగా అటవీ కార్మికుల శ్రమను దోపిడీ చేసి ఇప్పుడు వీధిపాలు చేయడం చాలా అన్యాయంగా ఉందన్నారు. టిటిడిలో అటవీ కార్మికుల పట్ల అనుసరిస్తున్న మొండి వైఖరిని తక్షణం మార్చుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఓ గాయత్రీదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, శ్రీ సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిప్పేస్వామి, శ్రీనివాసులు, నాగరాజు, రామాంజనేయులు, ఒన్నూరప్ప, ఈశ్వరయ్య, మధు, రవీంద్ర చారి, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

విద్యుత్ ఉద్యోగుల కార్యాచరణ సమితి డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్రప్రసాద్

ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రజాశక్తి-గుత్తి

తమ న్యాయమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేంత వరకూ పోరాటాలు కొనసాగిస్తామని ఎపి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల కార్యాచరణ సమితి డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఎపి రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన శుక్రవారం రెండోరోజూ కొనసాగింది. ఇందులో భాగంగా భోజన విరామ సమయంలో నాయకులు, ఉద్యోగులు, కార్మికులు, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పే రివిజన్ వెంటనే అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలన్నారు. ఇపిఎఫ్ టు జిపిఎఫ్‌ను అమలు చేయాలన్నారు. గ్రేడ్ 2 జేఎల్ఎం లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ లిమిటెడ్ మెడికల్ పాలిసీని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళనను విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రాజశేఖర్, డిఇ మేఘరాజ్, ఎఇలు ఎం.శ్రీకుమార్, కె.మధుసూదన్ రావు, జేఏసీ నాయకుడు శంషుద్దీన్, లైన్ ఇన్స్పెక్టర్లు ప్రహల్లాద, లక్ష్మీకాంతరెడ్డి, సీనియర్ లైన్ మాన్ లు కష్ణ, శ్రీనివాసులు, విశ్రాంత ఉద్యోగులు మహబూబ్ పీరా, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పి అక్కడి ప్రజలకు సహాయ, సహకారాలు అందించాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ సంఘటన అమానవీయమైనదన్నారు. మహిళల్ని నగ్నంగా ఊరేగించి అత్యాచారం, హత్యలు చేయడం సమాజానికే సిగ్గు చేటుగా ఉందన్నారు. అక్కడి బిజెపి ప్రభుత్వం నియంత్రించడంలో విఫలం చెందిందన్నారు. పోలీసు వ్యవస్థ కూడా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రధాని మోడీ తక్షణమే స్పందించి మణిపూర్‌లో శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రకాష్, వెంకటనారాయణ, బాబు, మసూద్, రామాంజి, అంజి, రామాంజి, మోహన, జీవా, మాబీ, పార్వతి, జయమ, లక్ష్మీదేవి, నాగరత్నమ, దేవి, లాలెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రైల్వే డిఆర్ఎం వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

రైల్వే కాంటాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో డివిజనల్ రైల్వే మేనేజర్ మనీష్ అగర్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేలోని అన్ని విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. అయితే గుత్తేదారులు వారి శ్రమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. టెండర్ అగ్రిమెంట్‌లో కాంట్రాక్టర్స్ మారినా కార్మికులను తొలగించవద్దన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కనీసం వేతనం రూ.26వేలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు షబ్బీర్, మల్లి, కార్మిక నాయకులు పెద్దన్న, మురళి, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

మోడీ దుష్టపాలనకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

పుట్లూరు : కేంద్రంలోని మోడీ దుష్ట పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఆసన్నమైందని రైతుసంఘం మండల కార్యదర్శి వెంకటచౌదరి, ఉపాధ్యక్షులు శివారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలోని వైఎస్ఆర్ సర్కిల్ ఈనెల 30న నిర్వహించనున్న కార్మక, కర్షక రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడదుల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగానికి తీవ్రమైన హాని కలిగించే మూడు నల్లచట్టాలతోపాటు ఎలక్ట్రిసిటీ బిల్ 2020ని రద్దు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా 500పైగా రైతుసంఘాలతో ఏర్పడిన సభ్యత కిసాన్‌మోర్చా నేతృత్వంలో సంవత్సరం పైగా పోరాటాన్ని సాగించినా లెక్కచేయని ప్రధాని మోడీ ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలు దగ్గర పడటంతో దేశ రైతాంగానికి క్షమాపణ చెప్పి రైతుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. రైతులతో చర్చించిన తర్వాత పార్లమెంటులో ఎలక్ట్రిసిటీ బిల్లు ప్రవేశపెడతామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికే ఈనెల 30న విజయవాడ పి.బి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, కుళ్లాయప్ప, సంజీవపురం కుళ్లాయప్ప, యు.నవీన్, పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, రైతులు గుత్తా శంకర్, వద్ది నారాయణరెడ్డి, బి.రామాంజనేయులు, వెంకీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

బహుమతులు అందజేస్తున్న డిఐజి అమ్మిరెడ్డి

అనంతపురం : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్.ఎన్.అమ్మిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని భువన విజయ ఆడిటోరియంలో క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొని బహుమతులు పొందడం చాలా గర్వకారణమన్నారు. ప్రతి విద్యార్థి చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ, కష్టపడే గుణం అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడలు, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం.వి.లక్ష్మయ్య, ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎం.వి.శ్రీనివాసన్, బోధన, బోధనేతర సిబ్బంది, పాల్గొన్నారు.

పంటనమోదు తప్పనిసరి : ఎడిఎ

పొలంబడిలో పాల్గొన్న వ్యవసాయ అధికారి మహేంద్ర, అధికారులు

గుత్తి : రైతులు సాగు చేసిన పంటల వివరాల నమోదు తప్పనిసరి అని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. వెంకటరాముడు సూచించారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని సిఎల్ఆర్‌సి కార్యాలయంలో గుత్తి డివిజన్ పరిధిలోని గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, సింగనమల, యాడికి మండలాల వ్యవసాయ అధికారులు, ఎఇఒలు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి పంట నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసాతో పాటు పలు పథకాలు రైతులకు వర్తించేందుకు సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అలాగే 14 వారాలపాటు పొలంబడి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు నిల్వ ఉంచాలన్నారు. కొర్ర, జొన్న సాగు ఉత్పాదకతను పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు లీనా వసుంధర, మల్లీశ్వరి, ఎస్.మహబూబ్ బాషా, మెహర్నిషా బేగం, ఆశిష్ కుమార్, ఎఇఒ కృష్ణభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి : కలెక్టర్

అనంతపురం కలెక్టర్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకూ గుర్తించిన 39 బ్లాక్ స్పాట్ లను రోడ్డు భద్రతాపరంగా రోడ్డు ప్రమాద రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నారు. గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. జిల్లాలోని కళాశాలల్లో, డిగ్రీ కాలేజీలలో, ఇంజనీరింగ్ కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాలు ఎలా తగ్గించాలన్న విషయాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.యుగంధర్, పీఆర్ ఎస్ఇ భాగ్యరాజ్, జిజిహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ సతీష్ రెడ్డి, ఎపిఎస్ఆర్టీసీ అధికారి రమేష్ బాబు, ఎన్ హెచ్ డిఈఈలు గిడ్డయ్య, ఆర్సీ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ, డిసిహెచ్ఎస్, పోలీస్ మరియు రవాణా శాఖ అధికారులు, ఎన్జీవోస్, వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి : ఎస్పీ

అనంతపురం క్రైం : పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక పోలీస్ రక్షక్ ప్రీప్రైమరీ పాఠశాలలో పేరెంట్స్ వెరిఫికేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలన్నారు. పిల్లల్లో దాగి ఉన్న క్రియేటివిటీని తల్లిదండ్రులు గమనించి వెలికి తీస్తూ ఉండాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లలలో మరింత ఉత్సాహం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బెంగళూరు క్రీడా ఏజెన్సీ మేనేజర్ నందిని, అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ రాజశేఖరరెడ్డి, ప్రైమరీ స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, స్కూల్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'విదేశీ విద్యాదీవెన' ఓ బూటకం : టిడిపి

ప్రజాశక్తి-అనంతపురం

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ఓ బూటకమని టిడిపి బిసి సెల్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విదేశీ విద్యకు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరును తొలగించి జగనన్న విదేశీ పథకమని పేరు మార్చడం దుర్మార్గమన్నారు. అంతేగాకుండా ఈ పథకం ద్వారా పేద విద్యార్థులైన బీసీలు, ముస్లింలు, మైనారిటీలు, ఎస్సీలు, ఎస్టీలు లబ్ధి పొందడం గగనమైపోయిందన్నారు. అనంతపురం జిల్లా నుండి కేవలం ఐదుగురు విద్యార్థులకు మాత్రమే జగనన్న విదేశీ విద్యా పథకం ద్వారా అర్హత సాధించడం బాధాకరమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, సిఎం జగన్ స్పందించి విదేశీ విద్యా పథకంలో అర్హతలను సడలించాలని, అంబేద్కర్ పేరును యథాతథంగా కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటనారాయణ, నగర అధ్యక్షులు సిమెంటు పోలన్న పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

అనంతపురం క్రైం : మద్యానికి బానిసై ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ సీఐ ధరణికిషోర్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గంగానగర్‌కు చెందిన ఆనంద్ తల్లితో కలిసి నివసిస్తున్నాడు. మద్యానికి బానిసై నిరంతరం తల్లిని వేధిస్తూ ఉండేవాడు. దీంతో విసిగిపోయిన తల్లి ఇంటిని జనశక్తినగర్‌కు మార్చాలని అనుకుంది. ఈ విషయమై వాదోపవాదాలు జరగడంతో మనస్తాపానికి గురైన ఆనంద్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

11 కెవి వైర్ పడి చీనీ చెట్లు దగ్ధం

గార్లదిన్నె : మండల పరిధిలోని కొట్టాలపల్లి గ్రామంలో రైతు ఆదిశేషయ్యకి చెందిన 400 చీనీ చెట్లు శుక్రవారం మధ్యాహ్నం 11 కెవి వైరు తెగిపడటంతో కాలిపోయాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. చీనీ చెట్ల మధ్యలో గడ్డి మందు పిచికారి చేయడంతో గడ్డి ఎండిపోయింది. దీంతో వైర్లు గడ్డి మీద పడడంతో మంటలు వ్యాపించి చీనీ చెట్లు మొత్తం కాలిబూడిదయ్యాయని రైతు కన్నీరుమున్నీరన్నాడు. ఎలాగైనా ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

నగల దుకాణంలో చోరీ

యాడికి : మండలంలోని రాయలచెరువు మెయిన్ రోడ్డులో ఉన్న విశ్వరూపం ఆచారి నగల దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. విశ్వరూపం కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఓ శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి చోరీ జరిగిందని బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సుమారు 150 గ్రాముల బంగారం, 2.9 కిలో వెండి చోరీకి గురైనట్లు వాపోయాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ గంగయ్య, సీఐ శంకర్ రెడ్డి, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దింపి తనిఖీలు చేపట్టారు.

టిప్పర్, ట్రాక్టర్లు పట్టివేత

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని బుగ్గ సర్కిల్, ఆలూరు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో అనంతపురం సెబ్ అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఇసుక అక్రమ రవాణాపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక టిప్పర్, ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఆరుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ అధికారులు తెలిపారు. సీజ్ చేసిన వాహనాలు, డ్రైవర్లను తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో అనంతపురం స్క్వాడ్ సీఐ శ్రీనివాసులు, ఇంటెలిజెన్స్ సీఐ నరసానాయుడు, తాడిపత్రి సెబ్ సీఐ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎమ్‌డి జి.రఘునాథరెడ్డి

గుత్తి : మహిళా పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం చేయుతనందిస్తోందని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు సువర్ణావకాశం కల్పిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ ద్వారా పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలనుకునే మహిళల ఆలోచనలను ప్రోత్సహిస్తోందన్నారు. నిధులను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎమ్మెస్ ఎంఇ ఐడియా హ్యాకథాన్ 3.ఓ అనే పేరుతో వేదికను ఏర్పాటు చేసిందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు, మహిళలు విద్య, వ్యవసాయ, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక శక్తి,విద్యుత్ వాహనాలు, సేవారంగం, ఐటీ తదితర అంశాలలో తమ వినూత్న ఆలోచనలను గేట్స్ కళాశాల వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలన్నారు.

కొర్రపాడులో స్వచ్ఛభారత్ కమిటీ సభ్యుల పర్యటన

బుక్కరాయసముద్రం : స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. ఇందులో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నుంచి ఏవిధంగా సేకరిస్తురు, వాటిని డంపింగ్ చేర్చిన తర్వాత ఏం చేస్తురని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బీసీ కాలనీలోని ఇంటి యజమానులతో మాట్లాడుతూ ఇళ్లలోని చెత్తను గ్రామ పంచాయతీ రిక్షా ద్వారా సేకరిస్తున్నారా.. వ్యక్తిగత మరుగుదొడ్లు వాడుతున్నారా.. అని ఆరాతీశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేసి మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందంలోని సభ్యులు శ్రీమణికంఠ, స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సభ్యులు, ఎంపిడిఒ విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం : నగరంలోని మారుతీనగర్ నుంచి బైపాస్ రోడ్డు వరకూ దాదాపు 1 కిమీ మేర బిటి రోడ్డు నిర్మాణం పనులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏమాత్రం నాణ్యత లోపించకుండా నెలరోజుల్లోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు దాసరి వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాసులు, నరసింహులు, భాస్కర్, లోకనాథ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. శుక్రవారం నగరంలోని శ్రీనివాసనగర్‌లో చేపట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సహాయ మలేరియా అధికారి సత్యనారాయణతో కలిసి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మలేరియా, డెంగీ జ్వరాలు, వాటిని కలిగించే దోమల నియంత్రణ గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్, అంగన్‌వాడీలు అనిత, అలీమా, ఆశా, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శం

ఉరవకొండ : అభివృద్ధి, సంక్షేమంతోపాటు మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం విడపనకల్లు మండలం పొలికి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, వైస్ ఎంపిపి పుష్పావతి భీమ్‌రావు, సర్పంచి బోయ నాగమ్మ, ఉప సర్పంచి శ్రీనివాసులు, తహశీల్దార్ ఈరమ్మ, ఇఒఆర్‌డి సత్యాబాబు, మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, నాయకులు కరణం భీమరెడ్డి, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

రాయదుర్గం రూరల్ : వేరుశనగ సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి మహేంద్ర సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని జుంజురంపల్లిలో సాగు చేసిన వేరుశనగ పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఎంపిక చేసిన 30 మంది వేరుశనగ రైతులకు 14 వారాలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విత్తే సమయం మొదలుకుని విత్తనం చేతికొచ్చేంత వరకూ రైతులకు పూర్తిగా అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యంగా రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకం పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు నాగరాజు, శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శరణప్ప, సత్యన్న, రైతులు, వాలంటీర్లు పాల్గొన్నారు.